సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 27 । జూన్ । 2023



తగ్గిన చీనీ ధర

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయల ధర తగ్గింది. టన్ను గరిష్ట ధర రూ.23వేలు పలికింది.



ఎదగండి..నేస్తంలా నిలవండి

యువ న్యాయవాదులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని ఉపయోగించుకుని వృత్తిలో ఎదగాలని ఎంపీ మాధవ్ ఆకాంక్షించారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.2°/22.1°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఆరంభంలోనే టమాట అ'ధర'హో



టమాట మండీలో వేలం దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: సీజన్ ఆరంభంలోనే టమాట ధర అదిరిపోయింది. అనంతపురం సమీపంలోని కక్కలపల్లి టమాట మండీలో క్రయ విక్రయాలు మొదలయ్యాయి. సోమవారం మార్కెట్‌కు 1,500 కిలోల టమాటాలు అమ్మకానికి వచ్చాయి. 15 కిలోల బాక్సు ధర ఏకంగా రూ.1,000 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్మోహన్‌రావు తెలిపారు. అంటే కిలో గరిష్ఠ ధర రూ.66 కన్నా అధికంగా పలకడం విశేషం. ధరలు ఎగబాకుతుండటంతో రైతులకు గిట్టుబాటు అవుతుండగా.. వినియోగదారులను ఠారెత్తిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన కిలో టమాట రూ.100 పలుకుతోంది.

నేడు 'యువ ఉత్సవ్ 2023'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: యువతలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఈనెల 27న సంస్కృతీ ఇంజినీరింగ్ కళాశాలలో 'యువ ఉత్సవ్–2023' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. నెహ్రూ యువకేంద్ర, యువజన వ్యవహారాలు, క్రీడాశాఖ సంయుక్తంగా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో 'యువ ఉత్సవ్–2023' పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపన్యాసం, పెయింటింగ్, సాంస్కృతిక ప్రదర్శనలు, మొబైల్ ఫొటోగ్రఫీ తదిత అంశాల్లో పోటీల్లో నిర్వహిస్తామన్నారు. ఒక్కో అంశంలో తొలి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాస్, జిల్లా యువ అధికారి బిసాటి భరత్, పతంజలి యోగా గురువు మహేష్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

ఈశ్వరమ్మ పాఠశాలలో 68 మందికి అడ్మిషన్లు

ప్రశాంతి నిలయం: స్థానిక ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఒకటో తరగతి ప్రవేశాలకు సోమవారం లాటరీ తీశారు. సత్యసాయి విద్యాసంస్థల ఆడిటోరియంలో ఎంఈఓ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరామకృష్ణ పర్యవేక్షణలో మొత్తం 68 మందిని ఎంపిక చేశారు. ఇందులో బాలికలు 34 మంది, బాలురు 34 మంది ఉన్నారు. జూలై రెండో వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రధానోపాధ్యాయుడు శివరామకృష్ణ తెలిపారు.

ఖాళీ సీట్ల భర్తీకి పరీక్షలు

ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో 3 నుంచి 8వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 27, 28వ తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శివరామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తరగతుల్లో బాలికలకు మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

హాయివేకు అడుగులు

బెంగళూరు–విజయవాడ మధ్య జిల్లా మీదుగా ఏర్పాటు చేస్తున్న ఆరులేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే భూసేకరణ పూర్తి కాగా, టెండరు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు పనులు ముమ్మరం చేశాయి. ప్రస్తుతం బెంగళూరు నుంచి విజయవాడ మధ్య 560 కి.మీ దూరం ఉండగా, బస్సు లేదా కారులో ప్రయాణిస్తే దాదాపు 12 గంటల సమయం పడుతోంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే దూరం 342 కి.మీకి తగ్గుతుంది. కేవలం ఆరు గంటల్లోనే గమ్యస్థానం చేరుకోవచ్చు.



గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ఊహాచిత్రం

- బెంగళూరు–విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే
- 10 ప్యాకేజీలతో టెండర్ల ప్రక్రియ పూర్తి
- భూసేకరణ పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇటీవలే ప్రారంభమైన రోడ్డు పనులు

కదిరి: 'భారత్‌మాల' ప్రాజెక్టులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీ సత్యసాయి జిల్లా మీదుగా బెంగళూరు–విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. రూ.19,200 కోట్లతో ఆరు లేన్లుగా 342 కిలోమీటర్ల మేర నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసింది. దీంతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) పనులను 10 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు అప్పగించింది. ఈ మధ్యే ఓ వైపు విజయవాడ నుంచి మరోవైపు జిల్లా సరిహద్దులోని జాతీయ రహదారి 44 నుంచి కూడా పనులు ప్రారంభించారు. 2025 నాటికి ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

దూరం తగ్గించడం...రవాణా సౌకర్య పెంచడం

ప్రస్తుతం జిల్లా నుంచి విజయవాడకు వెళ్లాలంటే సరైన రోడ్డు మార్గం లేదు. కర్ణాటకకు కూడా అనుసంధానం సరిగా లేదు. ఈ రెండు ప్రయోజనాలను సాధించాలన్న ద్విముఖ వ్యూహంతో రాష్ట్రంలో మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ వేగా బెంగళూరు–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించారు. సీఎం సమర్పించిన ప్రతిపాదనలను కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదించారు. ప్రస్తుతం బెంగళూరు–విజయవాడ మధ్య దూరాన్ని దాదాపుగా సగానికి తగ్గించే విధంగా ఈ రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. ఈ హైవే నిర్మాణం పూర్తయితే బెంగళూరు నుంచి విజయవాడకు ఆరు గంటల్లో చేరుకోవచ్చు. సరుకు రవాణా కూడా మరింత పెరగనుంది.

ఎకరాకు రూ.9.20 లక్షలు

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.9.20 లక్షల చొప్పున చెల్లించింది. డీ పట్టా ఉన్న రైతులకు సైతం పట్టా భూములతో సమానంగా పరిహారం ఇచ్చింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంత పెద్ద మొత్తంలో పరిహారం చెల్లించలేదు. అందుకే నిర్వాసిత రైతులు హైవే నిర్మాణం కోసం భూములిచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు.

రూట్‌మ్యాప్ ఇలా

ఇప్పటికే బెంగళూరు – హైదరాబాద్ మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారి–44 ఉంది. ఈ హైవేకు అనుసంధానంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే జిల్లాలో కోడూరు తోపు వద్ద ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల, పుట్టపర్తి నియోజకవర్గం పుట్టపర్తి, ఓడి చెరువు, నల్లమాడ, ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ, కదిరి నియోజకవర్గం కదిరి రూరల్, తలుపుల మండలాల మీదుగా వైఎస్సార్ జిల్లా పులివెందులకు చేరుకుంటుంది. అక్కడి నుంచి నెల్లూరు జిల్లా మల్లేపల్లి, వంగపాడు, ప్రకాశం జిల్లా అద్దంకి, మేదరమెట్ల మీదుగా జాతీయ రహదారి 16కు అనుసంధానం అవుతుంది. ఇది నేరుగా విజయవాడ చేరుకుంటుంది.

రహదారి పేరు	గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే
6 గంటలు	పూర్తయితే బెంగళూరు–విజయవాడ మధ్య ప్రయాణ సమయం
342 కి.మీ	ఎక్స్‌ప్రెస్‌వే దూరం
రూ.19,200 కోట్లు	అంచనా వ్యయం
2025	రహదారి నిర్మాణం పూర్తికి లక్ష్యం

నాభూమికి రూ.18 లక్షల పరిహారం



గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే కోసం అధికారులు నాభూమి తీసుకున్నారు. పరిహారంగా రూ.18 లక్షలు నా బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. ఆశించిన దానికంటే ఎక్కువగానే వచ్చింది. రోడ్డు పూర్తయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– కె.బయారెడ్డి, కుటాలపల్లి, నల్లమాడ మండలం

ఇది సీఎం వైఎస్ జగన్ ఆలోచన



బెంగళూరు–విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించాలనేది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయడం. వెంటనే భూసేకరణతో పాటు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు కూడా ప్రారంభించడం సంతోషం. రైతులకు అన్యాయం జరక్కుండా పెద్దమొత్తంలో పరిహారం ఇవ్వడంతో రైతులంతా సీఎంకు ధన్యవాదాలు చెబుతున్నారు. గతంలో చంద్రబాబు కేంద్రంలోని బీజేపీతో పొత్తులో ఉన్నా రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదు.

–డా.పీవీ సిద్దారెడ్డి, ఎమ్మెల్యే, కదిరి

'సమగ్ర శిక్ష'లో మరో వికెట్ ఔట్

- అటెండర్‌ను విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వుల జారీ



రాప్తాడురూరల్: అనంతపురంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో మరో వికెట్ పడింది. శ్రీసత్యసాయి జిల్లాలోని నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనుల పేరుతో సాగించిన సిమెంట్ దందాలో అటెండర్‌ను విధుల నుంచి తప్పిస్తూ సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల కిందట కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. అలాగే 'మనబడి నాడు–నేడు' పనులతో పాటు ఇతర ప్రభుత్వ పనులకు వినియోగిస్తున్న సిమెంట్ కోసం ఇండెంట్ విషయంలో ఒకటికి రెండుసార్లు లాగిన్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అక్రమార్కుల్లో వణుకు

కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు వారిద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని అనంతపురం కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష ఈఈ మంగళవారం అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు. పోలీసు కేసు నమోదు కానుండడంతో అక్రమార్కుల్లో వణుకు పట్టుకుంది. సమగ్ర శిక్ష ఈఈ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులతో పాటు వీరి వెనుక ఉన్న వారందరినీ పోలీసుల దర్యాప్తులో బయటకు లాగనున్నారు. కొందరు సైట్ ఇంజినీర్లతో పాటు అధికారుల పాత్రపైనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

డిపార్ట్‌మెంటల్ విచారణకు ఆదేశం!

సిమెంట్ దారి మళ్లింపు వ్యవహారంపై ఓవైపు పోలీసుల దర్యాప్తుతో పాటు మరోవైపు శ్రీసత్యసాయి కలెక్టర్ అరుణ్‌బాబు డిపార్ట్‌మెంటల్ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. సమగ్ర శిక్ష అధికారులతో కాకుండా ఇతర డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమగ్రంగా విచారించనున్నట్లు సమాచారం.

ఏ ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండకూడదు

- అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలి
- 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



కలెక్టర్ వద్ద కన్నీటి పర్యంతమవుతున్న గోరంట్ల మండలం రెడ్డిచెరువుపల్లికి చెందిన సుశీలమ్మ

పుట్టపర్తి అర్బన్: ''స్పందన, జగనన్నకు చెబుదాం తదితర కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీల్లో ఒక్కటి కూడా పెండింగ్‌లో ఉండకూడదు. సమస్య పరిష్కారం మొక్కుబడిగా కాకుండా..అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యంగా ఉండాలి'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై 240 అర్జీలు అందగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో సమీక్షించారు. అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి పరిష్కరించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు.

జగనన్న సురక్షను విజయ వంతం చేయండి

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి కొనసాగింపుగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా వలంటీర్, సచివాలయ ఉద్యోగి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా...లేదా ఆరా తీయడంతో పాటు కుటుంబ యజమాని ఫొటో క్యాప్చర్ చేసి వివరాలను రికార్డు చేయాలన్నారు. ఏదైనా పథకానికి అర్హత ఉండీ అందకపోతే అందుకు అవసరమైన పత్రాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, పట్టుపరిశ్రమ జేడీ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

- అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబును కలిసిన ఏపీ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు నూతన జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రకటించిన 16 శాతం హెచ్‌ఆర్‌ఏ అన్ని శాఖల్లోని ఉద్యోగులు వర్తింపజేయాలని వినతి పత్రం అందజేశారు.

స్థలాన్ని ఆక్రమించి..దాడి చేశారు

నేను గోరంట్ల సమీపంలోని సర్వే నంబర్ 275–1లోని 2.5 సెంట్లు భూమిని 2015లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నా. ఇటీవల ఇల్లు నిర్మించుకునేందుకు వెళ్తే... శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, వాసునాయక్ తదితరులు నాపై దాడి చేసి జేసీబీతో స్థలాన్ని ఆక్రమించుకున్నారు. పైసాపైసా కూడబెట్టి సంపాదించుకున్న ఆస్తిని, కుటుంబాన్ని రక్షించాలి.

– కలెక్టర్ ఎదుట కన్నీటి పర్యంతమైన గోరంట్ల మండలం రెడ్డిచెరువుపల్లికి చెందిన సుశీలమ్మ

'మత్తు'తో జీవితాలు చిత్తు

- మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి
- ఎస్పీ ఎస్.వి మాధవరెడ్డి పిలుపు

పుట్టపర్తి టౌన్: మత్తు పదార్థాల జోలికి వెళ్తే జీవితాలు అంధకారమవుతాయని, అందువల్ల యువత వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం కొత్తచెరువులో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి అనంతరం నెహ్రూ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. కొందరు యువకులు మత్తు పదార్థాలకు బానిసలైన వాటి కొనుగోలుకు అవసరమైన డబ్బు కోసం నేరాలు, హత్యలకు పాల్పడుతున్నారన్నారు. పిల్లలు దారి తప్పితే ఆ తల్లిదండ్రులు పడే బాధ వర్ణించలేనిదన్నారు. దీన్ని గుర్తించి మసలుకోవాలన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా ఇప్పటికే గంజాయి స్థావరాలపై దాడులు చేయడంతో పాటు గంజాయి విక్రేతలపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చూస్తున్నామన్నారు. పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారిని సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు వాసుదేవన్, రవికుమార్, కొత్తచెరువు సీఐ రామయ్యతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



కొత్తచెరువులో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుత పరిస్థితుల్లో వీఐపీలకు భద్రత కల్పించడం సవాళ్లతో కూడుకున్న అంశమని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ (పీఎస్‌ఓ)లు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం జిల్లా పరిధిలో పనిచేస్తున్న పీఎస్‌ఓ, బీడీ టీం సభ్యులకు ఆర్‌ఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీఐపీల భద్రత విషయంలో పాటించవలసిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ నిబద్ధతో పనిచేయాలన్నారు. వీఐపీల రక్షణే ప్రథమ ధ్యేయంగా భావించాలన్నారు.

'అమ్మఒడి'తో విద్యా వెలుగులు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- వేలాది మంది మహిళలతో ధర్మవరంలో భారీ ర్యాలీ

ధర్మవరం: 'జగనన్న అమ్మఒడి' పథకంతో పేద కుటుంబాల్లో విద్యా వెలుగులు విరబూస్తున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. నిరక్షరాస్యతను రూపు మాపే బ్రహ్మాస్త్రంలా ఈ పథకం మారిందన్నారు. ఈనెల 28న 'జగనన్న అమ్మఒడి' నిధులు విడుదల చేయనున్న సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం ధర్మవరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది మహిళలతో కలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో మారుతీ రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీనగర్, పీఆర్‌టీ సర్కిల్ మీదుగా కొనసాగింది. అనంతరం కళాశాల సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. పేద కుటుంబాల్లోని చిన్నారులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యనందిస్తున్నారన్నారు. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోని తల్లుల ఖాతాలోనే ఇప్పటివరకూ రూ.162 కోట్లు నిధులు జమ చేశారన్నారు. ఈ సాయం ద్వారా పేదవారు సైతం ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చదివించుకుంటున్నారన్నారు. మరోవైపు 'నాడు– నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించి 'కార్పొరేట్'కు స్కూళ్ల సరసన నిలిపారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాం, షూ అందిస్తున్నారన్నారు. అంతేకాక మధ్యాహ్న భోజనం, రాగిజావ అందిస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు కోసం చిత్తశుద్ధితో పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ను అభినందించాల్సిన ప్రతిపక్ష నేత చంద్రబాబు లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం అందుబాటులోకి తెస్తే ఓర్వలేని నీచులు టీడీపీ వారన్నారు. సీఎం వైఎస్ జగన్ పథకాలను కాపీ కొడుతూ మళ్లీ మోసం చేసేందుకు గుంట నక్కలు వస్తాయని, వాటిని తరిమి తరిమి కొట్టాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వై.భాగ్యలక్ష్మి, పి.నాగరాజు, తాడిమర్రి ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, బత్తలపల్లి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ముదిగుబ్బ ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణరెడ్డి, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంతోపాటు కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



ధర్మవరంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న జగనన్న అమ్మఒడి లబ్ధిదారులు

బార్‌లో అగ్ని ప్రమాదం

కదిరి టౌన్: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లోని ఎస్‌ఎల్‌వీ బార్‌లో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి బార్‌లో వ్యాపారం ముగించుకుని సెట్టర్లకు తాళం వేసి నిర్వాహకుడు వెంకటేష్ ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి బార్‌లో మంటలు ఎగిసి పడుతుండడంతో గమనించిన పక్కనే ఉన్న హోటల్ యజమాని ఫోన్ చేసి సమాచారం అందించడంతో వెంకటేష్ అక్కడకు చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసే లోపు బార్‌లో ఫర్నీచర్, మద్యం పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు యజమాని వాపోయాడు. కాగా, ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై తనకు అనుమానం ఉందంటూ బార్ యజమాని వెంకటేష్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ బసయ్య తెలిపారు.

ఎదగండి.. నేస్తంలా నిలవండి

- నిరుపేదలకు అండగా నిలిచి న్యాయం చేయండి
- జూనియర్ న్యాయవాదులకు ఎంపీ గోరంట్ల మాధవ్ పిలుపు
- 44 మంది 'లా నేస్తం' లబ్ధిదారులకు రూ.11 లక్షల చెక్కు అందజేత


యువ న్యాయవాదులతో ఎంపీ గోరంట్ల మాధవ్

పుట్టపర్తి అర్బన్: ''న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన జూనియర్ లాయర్లు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఎదగాలి, నిరుపేదలకు న్యాయం చేకూరుస్తూ వారికి నేస్తంలా నిలవాలి'' అని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పిలుపునిచ్చారు. 'వైఎస్సార్ లా నేస్తం' ద్వారా అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేల చొప్పున అందజేసే స్టైఫండ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న ఎంపీ మాధవ్...జిల్లాలోని 44 మంది లబ్దిదారులకు ఫిబ్రవరి నుంచి జూన్ వరకు నెలకు రూ.5 వేల చొప్పున 44 మందికి రూ.11 లక్షలకు సంబంధించిన మెగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ, 'వైఎస్సార్ లా నేస్తం' పొందుతున్న జూనియర్ లాయర్లు వృత్తిలో స్థిర పడడానికి మంచి లా పుస్తకాలను కొనుగోలు చేసి పట్టు సాధించాలన్నారు. 'వైఎస్సార్ లా నేస్తం' వంటి సంక్షేమ పథకం బహుశా దేశంలోనే ఎక్కడా లేదన్నారు. యువ న్యాయవాదులు వృత్తి రాణిస్తూ పేదలకు ఉచితంగా న్యాయసేవలు అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

అర్హులుంటే దరఖాస్తు చేసుకోండి

'వైఎస్సార్ లా నేస్తం' పథకానికి అర్హత ఉండి ఇంకా పథకం అందుకోలేని వారు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయల జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి సూచించారు. లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. తొలి మూడేళ్ల ప్రాక్టీస్ ఉండాలని, దరఖాస్తు దారుని పేరు రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నమోదై ఉండాలన్నారు. అలాగే ప్రాక్టీస్‌లో ఉన్నట్లు సీనియర్ న్యాయవాదితో అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వివిధ కోర్టుల యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

పుస్తకాలు కొనుగోలు చేస్తా



'వైఎస్సార్ లా నేస్తం' నిధులతో న్యాయవాద వృత్తిలో రాణించేందుకు అవసరమైన పుస్తకాలు కొనుక్కుంటా. నేను యువ న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలు పెట్టిన తొలి ఏడాదే వైఎస్సార్ లా నేస్తం అందడం ఆనందంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని పని సీఎం వైఎస్ జగన్ చేపట్టారు. పేద కుటుంబాల్లోని యువ న్యాయవాదులు కెరీర్‌లో నిలదొక్కుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

– కావ్యశ్రీ, బుక్కపట్నం

ధీమా వచ్చింది



యువ న్యాయవాదులకు ప్రభుత్వం ఇస్తున్న సహకారంతో న్యాయవాదిగా నిలబడతాననే ధీమా వచ్చింది. ప్రతి నెలా రూ.5 వేలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ఎంతో ప్రావీణ్యం సాధించాల్సి ఉంటుంది. ప్రతి నెలా ఆర్థిక సాయంతో పాటు అర్హులైన న్యాయవాదుల కోసం ప్రభుత్వం కార్పస్ ఫండ్ కేటాయించడం అభినందనీయం.

– రుక్సానా, అనంతపురం కోర్టు

మూడేళ్లకు రూ.1.80 లక్షలు



న్యాయవిద్య పూర్తి చేసిన విద్యార్థులకు 'వైఎస్సార్ లా నేస్తం' భరోసాను ఇస్తుంది. వృత్తిలో నిలబడడానికి మూడేళ్ల పాటు ఒక్కో న్యాయవాదికి సుమారు రూ.1.80 లక్షలు అందజేయడం చాలా సంతోషంగా ఉంది. పేదలకు కచ్చితంగా అతి తక్కువ ఫీజులతోనే న్యాయం అందజేసి ప్రభుత్వ రుణాన్ని తీర్చుకుంటా. జూనియర్ లాయర్లను ఇంతలా ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– రామకృష్ణ, కొత్తచెరువు

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డారు.


మృతురాలు సుమన్

- పుట్టపర్తి టౌన్: మండల కేంద్రం కొత్తచెరువులో నివాసముంటున్న వివాహిత సుమన్ (21) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఢిల్లీకి చెందిన దిలీప్‌కుమార్, సుమన్ దంపతులు బతుకు తెరువు కోసం వలస వచ్చి కొత్తచెరువు దర్గా స్ట్రీట్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వీరిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకుని ఘర్షణ పడేవారు. మూడు రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి వచ్చారు. సోమవారం ఉదయం మళ్లీ గొడవ పడడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సుమన్... భర్త ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతురాలు మూడు నెలల గర్భిణిగా తెలిసింది.
- గోరంట్ల: స్థానిక ఆర్‌కే థియేటర్ సమీపంలో అద్దె ఇంట్లో నివాసముంటున్న వివాహిత రేణుక (30) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు... మండలంలోని కమ్మలవాండ్లపల్లి గ్రామానికి చెందిన దంపతులు రేణుక, వడ్డే ఆనంద్ 20 రోజుల క్రితం గోరంట్లకు మకాం మార్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెందిన రేణుక... సోమవారం ఉదయం భర్త క్వారీలో పనికి వెళ్లగా... కుమార్తె లిఖితను పాఠశాలకు పంపి ఇంటి తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన లిఖిత తలుపు తడితే తల్లి స్పందించలేదు. దీంతో సమాచారం అందుకున్న బంధువులు అక్కడకు చేరుకుని తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రేణుకను కిందకు దించి, సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై రేణుక అన్న వెంకటరంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య భార్య శ్యామల ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ కలహాలతో విసుగు చెందిన ఆమె సోమవారం భర్త ఇంట్లో లేని సమయంలో ఊజీ మాత్రలు మింగింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు.. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు.

విద్యారంగంలో ప్రభుత్వ సంస్కరణలు భేష్

- మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు


మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులునాయుడు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో జగన్ సర్కార్ చేపట్టిన విద్యా సంస్కరణలు ఎంతో బాగున్నాయంటూ మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తికి విచ్చేసిన ఆయన స్థానిక పెద్ద బజారులోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల 679 ఎంఈఓ–2 పోస్టుల భర్తీ నిర్ణయం హర్షం వ్యక్తం చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రజనీకాంతరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాబయ్య పాల్గొన్నారు.

డీసీసీబీ లక్ష్యం రూ.2వేల కోట్లు

- మహాజన సభలో చైర్‌పర్సన్ ఎం.లిఖిత


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లా సహకార బ్యాంకు (డీసీసీబీ) టర్నోవర్ రూ.2వేల కోట్ల మార్కును చేరుకునేలా కలసికట్టుగా పనిచేయాలని బ్యాంక్ ఉద్యోగులు, పాలక వర్గ సభ్యులకు ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత సూచించారు. స్థానిక డీసీసీబీ హాలులో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన 125వ మహాజన సభలో ఆమె మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ పూర్తయిందన్నారు. రూ.1.04 కోట్లు నికరలాభం రావడం మంచి పరిణామమని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటికే బ్యాంకు లావాదేవీలు రూ.1,600 కోట్లు దాటిందన్నారు. ఈ ఏడాది ఆఖరులోపు రూ.2వేల కోట్లకు చేరాలన్నారు. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 13 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలన్నారు. ప్రస్తుతం 444 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై 7.70 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.20 శాతం వడ్డీరేటు వర్తిస్తుందని, ఈ అంశంపై ప్రజలను చైతన్య పరిచి డిపాజిట్లు సేకరించాలన్నారు. మహాజన సభలో డైరెక్టర్లు హైదర్‌వలి, శంకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామాంజనేయులు, రమణమూర్తి, అబ్దుల్ రఖీబ్, ఆప్కాబ్ ప్రతినిధి లావణ్య, బ్యాంకు జీఎం సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులపై శిక్షణ

పుట్టపర్తి టౌన్: పీస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా పారా మెడికల్ కోర్సులపై శిక్షణ ఇస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు బొగ్గు సురేష్ తెలిపారు. ఉజ్వల ఫౌండేషన్ నిర్వాహకులతో కలసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుట్టపర్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ టెక్నాలజీ ద్వారా ఈ ఏడాది నూతనంగా పారా మెడికల్‌కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ఆప్తోమెటరీ, ఆప్తోమెటిక్, ల్యాబ్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణకు ఇంటర్ పాసైన విద్యార్థులు అర్హులన్నారు. రెండేళ్ల కాలపరిమితి ఉన్న ఒక్కో కోర్సుకు 60 సీట్లు ఉంటాయని, ఇందులో 30 సీట్లు పేద విద్యార్థులకు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 99122 76429లో సంప్రదించాలని కోరారు.

ముగ్గురి అరెస్ట్

గోరంట్ల: కర్ణాటక మద్యంను అక్రమంగా మండలంలోకి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. చింతమానుపల్లి సమీపంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న చౌండూరివాండ్లపల్లి నివాసి వడ్డే శ్రీరాములును అరెస్ట్ చేసి, 96 టెట్రా ప్యాకెట్లను సీజ్ చేసినట్లు వివరించారు. అలాగే కమ్మలవాండ్లపల్లి సమీపంలో మోటర్ సైకిల్‌పై మద్యం తరలిస్తూ గంగంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, నబీరసూల్ పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి 192 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

టీడీపీ అను'కుల యాత్ర'

- ఎస్సీ రిజర్వు నియోజకవర్గంపై చిన్నచూపు
- మడకశిర బదులు రాప్తాడులో బస్సు యాత్ర
- మాజీ ఎమ్మెల్యే ఈరన్నపై 'గుండుమల' పెత్తనం
- పల్లె, పరిటాలతో కలిసి రూట్ మార్చిన గుండుమల
- 'తమ్ముళ్ల' గిమ్మిక్కులను పసిగట్టిన బీసీ, ఎస్సీలు
- 'భవిష్యత్తు గ్యారంటీ' యాత్రకు సహకరించని వైనం

సాక్షి, పుట్టపర్తి: టీడీపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యం లేదని మరోసారి నిరూపితమైంది. 'భవిష్యత్తు గ్యారంటీ' పేరుతో టీడీపీ నాయకులు నిర్వహిస్తున్న బస్సు యాత్రలో ఆ పార్టీ విధానమేమిటో అందరికీ తెలిసింది. పేరుకు బీసీ, ఎస్సీ నేతలు ఇన్‌చార్జిలుగా ఉన్నా.. ఆయా నియోజకవర్గాల్లో అగ్రవర్ణ కులాల వారే పెత్తనం చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కదిరి, పెనుకొండలో అసమ్మతి తారస్థాయికి చేరింది. మడకశిరలో కూడా బీసీ, ఎస్సీ నేతల మధ్య కోల్డ్‌వార్ ప్రారంభమైంది. అయితే పుట్టపర్తి, రాప్తాడులో మాత్రం అక్కడి నాయకులు పక్కా ప్లాన్‌తో బస్సు యాత్ర చేపట్టారు. పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఫలితంగా మిగతా నియోజకవర్గాల నేతల నుంచి టీడీపీ బస్సు యాత్రకు అడుగడుగునా అసమ్మతి ఎదురవుతోంది. దీంతో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్‌లో మార్పులు చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

మడకశిర బదులు రాప్తాడులో ఎంట్రీ

జిల్లా నుంచి దుకాణం సర్దుకుని అనంతపురం జిల్లాలో బస్సు యాత్ర ఎంట్రీ ఇచ్చింది. కదిరి, పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాల్లో బస్సు యాత్రకు స్పందన లేకపోవడంతో మడకశిరలో నిర్వహించకుండా రూట్ మార్చారు. అంతేకాకుండా మడకశిర ఎస్సీ రిజర్వుడు కావడంతోనే ప్రాధాన్యం ఇవ్వకుండా షెడ్యూల్ మార్చారని అక్కడి నేతలు బహిరంగ విమర్శలకు దిగారు. మడకశిరలోకి ప్రవేశించాల్సిన రోజునే రాప్తాడులో బస్సు యాత్ర మొదలు కావడంతో అగ్రవర్ణాలకే టీడీపీలో ప్రాధాన్యం ఇస్తున్నారని మరోసారి రుజువైంది. బీసీ, ఎస్సీ నేతలను పట్టించుకోకుండా.. పల్లె, పరిటాల సునీత అన్నీ తామై వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

మూడు రోజుల్లోనే ముగింపు

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, టీడీపీ నేతలు బస్సుయాత్రను కదిరి, పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాల్లో మూడు రోజుల పాటు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల వైఖరితో విసిగిపోయిన 'తమ్ముళ్లు' బస్సు యాత్రకు సహకరించలేదు. ఈ నేపథ్యంలో మూడు రోజులకే గేర్ మార్చారు. నాల్గో రోజు మడకశిర నియోజకవర్గంలో ప్రవేశించాల్సిన బస్సు యాత్రకు నేతల అసమ్మతి కారణంగా బ్రేక్ పడింది.

అసహనంగా తమ్ముళ్లు

'భవిష్యత్తు గ్యారంటీ' పేరుతో టీడీపీ నిర్వహిస్తోన్న బస్సు యాత్రపై తమ్ముళ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కదిరిలో కందికుంట వెంకటప్రసాద్, అత్తార్ చాంద్‌బాషా తమ అనుచర వర్గాలతో కలిసి ఎవరికి వారుగా వ్యవహరించారు. పెనుకొండలో సవితమ్మ – బీకే పార్థసారథి వర్గాల మధ్య గొడవ తారస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. మడకశిరలో గుండుమల తిప్పేస్వామి – ఈరన్న వర్గాల మధ్య అసమ్మతి పవనాలు వీస్తున్నాయి. నాయకుల మధ్య సఖ్యత లేని కారణంగా బస్సు యాత్రలో పాల్గొనేందుకు పార్టీ కార్యకర్తలు ఆసక్తి చూపలేదు. ఫలితంగా జిల్లాలో బస్సు యాత్రకు స్పందన కరువు కావడంతో నాయకులు డీలా పడ్డారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

- జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి రాజేంద్రకుమార్ నేగి


నల్లమాడ: కురుమాల వద్ద పొలంలో సరిహద్దు కందకాలను పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు

పుట్టపర్తి/లేపాక్షి/నల్లమాడ: జిల్లాలో భూగర్భ జలాలు పెంపే లక్ష్యంగా జలశక్తి అభియాన్ పథకం కింద పనులు చేపట్టినట్లు కేంద్ర జల్‌శక్తి అభియాన్ నోడలాఫీసర్ రాజేంద్ర కుమార్ నేగి అన్నారు. డ్వామా అధికారులతో కలసి సోమవారం ఆయన బుక్కపట్నం, లేపాక్షి, నల్లమాడ మండలాల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. బోడిగుట్టల్లో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేలా కందకాలు తవ్వాలని, ఉద్యాన తోటల సాగుపై రైతులను చైతన్యపరచాలని, పొలం గట్లతో పాటు, కందకాల తవ్వకాలను వేగవంతం చేయాలని సూచించారు. వీలైనన్ని నీటి సంరక్షణ పనులు చేపట్టాలని ఆదేశించారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్‌లో భాగంగా చేపట్టిన మామిడి తోటల సాగు, నీటి సంరక్షణ పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధి కూలీలో ముచ్చటించారు. లేపాక్షిలోని గురుకుల పాఠశాల ఆవరణలో సుమారు రెండు వందల మొక్కలు నాటారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లి పంచాయతీలో రైతు రవీంద్రకు చెందిన మామిడి తోటలో మామిడి మొక్కల మొదళ్ల చుట్టూ తవ్విన రింగ్ ట్రెంచ్ పనులను పరిశీలించి, దాని వల్ల ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా రైతు అఖిల పొలంలో సాగుచేసిన మామిడి మొక్కలను పరిశీలించారు. గంగాపురం వద్ద రైతు ఆదినారాయణకు చెందిన మామిడి తోటలో సరిహద్దు కందకాలను పరిశీలించి మామిడి చెట్లకు రింగ్ ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. దొన్నికోట వద్ద వెంకటరమణ పొలంలో సాగుచేసిన గులాబీ తోటను పరిశీలించారు. చివరగా బాసంవారిపల్లి వద్ద జరుగుతున్న ఎస్టీ వర్క్‌ను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, భూగర్భ జలాల శాస్త్రవేత్త రాఖీ, డ్వామా పీడీ రామాంజనేయులు, ఏపీడీలు శ్రీనివాసరెడ్డి, శివానందనాయక్, రఘునాథరెడ్డి, బుక్కపట్నం, లేపాక్షి, నల్లమాడ ఎంపీడీఓలు శ్రీనివాసులు, నరసింహనాయుడు, కొండన్న, ఏపీఓలు సూర్యనారాయణ, సుబహాన్, రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 61 వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 61 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీదారులతో వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.